అనగనగా... ఒక కథ

# కొక్కొరో కో

శశికళకి పెళ్ళయి, కాపురానికొచ్చి..హైదరాబాద్‌లో మకాం పెట్టి నెల్లాళ్లయింది.

రోజుకోసారైనా అమ్మని తిట్టుకుంటోంది.

వంట చేయడంలో ఒడుపులు, రుచిగా వండటంలో మెళకువలూ చెప్పలేనందుకు.

అదిగో అలాంటప్పుడే తల్లై-గురువై-వంట నేర్పిస్తున్న యాదమ్మ-

యాదమ్మ పిలుపు ప్రతీరోజూ తనకి మేలుకొలుపు!

'కొక్కొరోకో' అన్నట్లు 'ఆక్కూరలో ఆక్కూరలు' అని నిద్రలేపుతుంది!

శశికళకి తోటకూర కూరొండడం బాగా వచ్చు అల్లం వేసి...తోటకూర ముద్దకూర వండితే వాళ్లాయన సుబ్బారావుకి బాగా ఇష్టం-అందుకని రోజూ తోటకూరే కొంటోంది.

యాదమ్మ ఓ రోజు పొద్దున్నే వచ్చి...“శశమ్మా కూరలూ ఆక్కూరలు” అని పిలిచింది.

మళ్లీ తోటకూర రెండు కట్టలు కావాలని అడిగింది తను.

నెమ్మదిగా యాదమ్మ కబుర్లలోకి దింపింది శశికళని.

“సూడమ్మా! రోజూ ఓ కూరే వొండిపెడితే- రోజూ ఓ సీరే కడితే మగాడికి మొహమొత్తేస్తుంది. విసుగేసి కోపం వచ్చేస్తది - రోజూ రోజూ రుచి మారుస్తూ రంజుగా వొండాల-రోజురోజూ రంగు మారుస్తూ పసందుగా వుండాల!” అంటూ జీవితానికి సరిపడేంత నీతి చెప్పింది!!

“నేనేం చేయాలి? నన్నేం చెయ్యమంటావు” అని అమాయకంగా అడిగింది యాదమ్మని ఒక ఫ్రెండుని సలహా అడిగినట్లు.

తల్లిలా తన సలహా చెప్పింది యాదమ్మ...“ఇగో..ఈ గోంగూర పప్పులో వెయ్యి...అదేం కష్టం కాదు. గోంగూర తరిగి పప్పు ఉడకేసి రెండూ కలిపీ ఇంకొంచెం సేపు ఉడికించీ...” తిరగమోత (పోపు) ఏం పెట్టాలో కూడా చెప్పింది.

అలాగే మర్నాడు మెంతికూరని-ఆపైరోజు చుక్కకూరనీ పరిచయం చేసింది-ఏమి ఎలా వండాలో-ఎన్ని రకాలు వండచ్చో చెప్తోంది.

నిజానికి తనొక్క ఆకుకూరలే అమ్ముతున్నా..రకరకాల కూరగాయలు ఎన్ని రకాలొండచ్చో చెప్తోంది శశికళకి- తన అమ్మకాలు పూర్తయాక తిరిగి ఇంటికెళ్తూన్నప్పుడు మళ్లీ శశికళ ఇంటికెళ్లి ఓ అరగంట గడిపి వెళ్లటం, శశికళకి వంటల్లో ట్యూషన్ మాస్టరు అవటం యాదమ్మకి రెండో ఉద్యోగం అయిపోయింది.

భర్త ఆఫీసుకెళ్లిపోయాక ఈ మాస్టరమ్మ వస్తుంది గనక ఆయనకీ చికాకుండదు. తనకీ కాలక్షేపంగా వుంటుంది. అలాగే ఓ కప్పు చాయ్‌తో యాదమ్మకి గురుదక్షిణ సమర్పిస్తుంటుంది. ఒక్కోరోజు వానొచ్చో మరే కారణంవల్లో యాదమ్మ రాకపోతే శశికళకి చాలా వెల్తిగా అనిపించేది.

ఇలా వుండగా ఓరోజు యాదమ్మ అరుపులకి శశికళ మేల్కోలేదు. తలుపు కూడా తట్టింది. అయినా తెరవలేదు.

యాదమ్మకి ఏంటైందా అని బెంగ అనిపించినా...మిగిలిన ఇళ్లవాళ్లకి ఆలస్యం అవుద్దని వెళ్లి వతనుగా అందరికీ ఆక్కూరలిచ్చింది.

శశికళమ్మ ఎలా వుందో అసలేమైందో అని గుబులు పడుతూనే పని పూర్తి చేసుకుని పరిగెట్టుకొచ్చింది!

మొగడెళ్లినట్లున్నాడు-స్కూటర్ లేదు.

“శశమ్మా” అని ఆప్యాయంగా పిలుస్తూ మేడమీదకి వచ్చింది.

శశికళ కళ్లు ఎర్రగా వాచి వున్నాయి. రాత్రంతా నిద్రలేదేమో పిచ్చిపిల్లకి అని మనసులో నవ్వుకుంటూనే..కొంచెం నవ్వుకలిపిన గొంతులో పలకరించింది.

శశికళ కళ్లు పొంగిపొర్లాయి.

భోరున ఏడ్చింది.

తల్లిలా తల్లడిల్లిపోయింది యాదమ్మ. “ఏమయిందమ్మా- ఎందుకట్లా ఇదవుతున్నావ్”

కొంతసేపు ఏడ్చి “రాత్రాయన లేటుగా వచ్చారు. వచ్చీరాగానే బూట్లు కూడా విప్పకుండా మంచంమ్మీద అడ్డంగా పడుకున్నారు. నన్నన్నం తిన్నావా అని అడగలేదు-అన్నం తిందురుగానీ రండి అంటే లేవలేదు. ఇన్నాళ్ళుగా ఎప్పుడూ ఇలా లేదు. నాకు రాత్రంతా నిద్ర రాలేదు. ఆయన గుర్రుపెట్టి పడుకున్నారు.”

ఏడుపు మధ్యలోంచే ఒక్కోమాట చెప్పింది శశికళ.

“జరిగిందాన్ని మర్చిపో-సాగదీసి సతాయించమాకు”

“ఆయన తాగొచ్చారు..నాకు తెలుసా సంగతి..ఆఫీసులో లేటయిందని అబద్ధమాడారు..”

“తెల్వచ్చు..తెలియనట్టు నటించు”

“ఎందుకు నటించాలి-వాళ్ళలాగే మనమూ అబద్ధమాడాలా?”

“చూడమ్మా! నీవు నిజాయితీకోసం నిలేసి నిజం కక్కిస్తే నీ ఎదురుగుండానే ధైర్యంగా మందు కొట్టడం మొదలెడతాడు. పెద్దదాన్ని నా మాట విను... ఆర్నెల్లల్లో సేసిన ఒక్క తప్పుకి ఆడతోనే సుక్కెట్టయ్యకపోతే శానా పమాదాలుంటాయి. మనం ఆడోళ్లవమ్మా- మన బతుకులు మనమే కాపాడుకోవాలి”

“సూడమ్మా! రోజూ ఓ కూరే వొండిపెడితే- రోజూ ఓ సీరే కడితే మగాడికి మొహమొత్తేస్తుంది. విసుగేసి కోపం వచ్చేస్తది - రోజూ రోజూ రుచి మారుస్తూ రంజుగా వొండాల-రోజురోజూ రంగు మారుస్తూ పసందుగా వుండాల!” అంటూ జీవితానికి సరిపడేంత నీతి చెప్పింది!!

శశికళకి జ్ఞాననేత్రం తెరుచుకున్నట్టయింది.

మొగుడెళ్ళేప్పుడు నిద్దరోతున్నట్టు నటించి, "బయట టిఫిన్ తినేయండి, మధ్యాహ్నం లంచ్‌కి రండి" అని విసురుగా కోపంగా ముడుచుకు పడుకున్నా-యాదమ్మ మాటల్తో పశ్చాత్తాపం కలిగింది. లక్కీగా మొగుడ్ని "తాగావు కదా!" అని నిలదీయలేదు. యాదమ్మ చెప్పాక నిజమే అన్పించింది.

★ ★ ★

శశికళ భర్త మళ్ళీ ఆమెనెప్పుడూ బాధపెట్టలేదు.

శశికళ కూడా ఆ బాధ మనస్సులో పెట్టుకోలేదు. కొన్నాళ్ళకి శశికళ కడుపులో నలుసు పడింది. నలత, వేవిళ్ళు, మామూలే...

యాదమ్మ మధ్యాహ్నం విజిటింగ్‌లో వేవిళ్ళకి తగిన చిట్కాలు చెప్పేది. ఒక్కోసారి తనే స్టవ్ దగ్గరకెళ్ళి రుచికరంగా వంట చేసి తినిపించేది.

యాదమ్మ అంటే ప్రేమాభిమానాలు పెరిగిపోతున్నాయి. శశికళకీ, ఆమె భర్తకి కూడా.

సడెన్‌గా ఓ పది రోజుల్నుండి యాదమ్మ గొంతు విన్పించడం మానేసింది. ఇన్నాళ్ళుగా శశికళకి అలారం పిలుపులాంటి, కోడికూతలాంటి యాదమ్మ మాట విన్పించకపోతే లేవాలనే ఉండేది కాదు. కానీ, లేవాలి! తప్పదు.

పది రోజులు దాటాక "శశికళమ్మా! ఆక్కూరలూ" అనే కొత్త కోడికూత విన్పించింది.



అది యాదమ్మ గొంతు కాదు- ఐనా తన పేరు పెట్టి పిల్చినందుకు లేచింది.

ఆక్కూరల గంప యాదమ్మ తెచ్చేదే! ఆ చీర కూడా చాలాసార్లు యాదమ్మ కట్టుకొచ్చిందే! కానీ వచ్చింది యాదమ్మ కాదు.

యాదమ్మ కోడలట. వాళ్ళత్తమ్మకి పక్షవాతమొచ్చి నోరుపడిపోయిందట. కాలూ చెయ్యీ స్వాధీనం తప్పాయట.

ఇంకావిడ నడవగల్గి వచ్చినా, నోరుకి మెటాలిక్ వాయిస్‌తో 'ఆక్కూరలో' అనే 'కొక్కొరోకో'లు రావట.

శశికళ చాలా కదిలిపోయింది. అమ్మకి జబ్బు చేసినట్టు ఆత్రపడిపోయింది.

★ ★ ★

దారి చూపిస్తున్న ఆటోలోని యాదమ్మ కోడలికి, అత్తగారి మీద ఉన్న అభిప్రాయం అర్థమైంది.

ఆవిణ్ని తిట్టుకోవడం చాలా బాధ అన్పించింది.

యాదమ్మని చూసాక బాధపోయి, బాధ్యత తెల్సొచ్చింది.

తను యాదమ్మకేం చేయాలో నిశ్చయానికొచ్చింది.

డాక్టర్ బిల్లులు చూసి మందుల అవసరాలు తీర్చింది-యాదమ్మ కోలుకుంటోంది.

యాదమ్మ 'కొక్కొరోకో' అన్నట్లు పిలవకపోతే రోజెలా మొదలవుతుంది? అనే బెంగ శశికళకుంది.

"దేవుడా! యాదమ్మని నూరేళ్ళు ఆరోగ్యంగా బ్రతికించు" యాదమ్మ యాదమ్మ కాదు మా అమ్మ అంటూ ఆమె ఇచ్చిన సలహాలు గుర్తు చేసుకుంటూ తరచుగా అక్కడికి వెళ్తూనే వుంది.

యాదమ్మ పూర్తిగా కోలుకుని "ఆక్కూరలో..ఆక్కూరలు" అని పిలవాలని కళ ఎంతో కోరుకుంటుంది.

ఏమవుతుందో...?